

తెలంగాణ భవన్‌లో కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 22 సెప్టెంబర్ 2024 | HYDERABAD




## ఇంకుడు గుంత ఉండాలే..
# లేదంటే వాతే

ప్రతి ఇంట్లో ఇంకుడుగుంత తప్పనిసరి

లేకుంటే నీటి చార్జీలు రెట్టింపు

జనవరి నుంచి కఠిన నిబంధనలు

అక్టోబర్ 2 నుంచి స్పెషల్ డ్రైవ్



మీ ఇంటి ప్రాంగణంలో ఇంకుడు గుంత లేదా..? అయితే వెంటనే ఏర్పాటు చేసుకోండి.. లేదంటే.. వచ్చే ఏడాది నుంచి నీళ్ల ట్యాంకర్ బుక్ చేసే వారిని నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేస్తామంటోంది జలమండలి. భూగర్భ జలాలను పెంపొందించడంలో భాగంగా ప్రతి నల్లా వినియోగదారుడి ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడుగుంతను తప్పనిసరి చేస్తూ.. నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగానే క్యాన్ నంబర్ల ఆధారంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి స్పెషల్ డ్రైవ్ చేపట్టనున్నది. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత' పేరిట తనిఖీలు చేస్తూ.. 300 చదరపు మీటర్లు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న బహుళ గృహ సముదాయాలతో పాటు వ్యక్తిగత గృహాల డేటా సేకరించి.. ఆ వివరాలను ప్రత్యేక యాప్‌లో పొందుపర్చనున్నది. ఈ ఏడాది చివరి వరకు ఈ స్పెషల్ డ్రైవ్ ఉంటుంది. ఆ తర్వాత తమ ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడు గుంతలు నిర్మించకుండా ఉన్న యజమానులపై జలమండలి ప్రతాపం చూపనున్నది. వచ్చే ఏడాది 2025 జనవరి నుంచి వాటర్ ట్యాంకర్ బుక్ చేసుకునే వినియోగదారుల నుంచి రెట్టింపు చార్జీలు వసూలు చేయనున్నది.

-సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ)

**గ్రేటర్ హైదరాబాద్‌లో** ప్రతి ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి చేస్తూ జలమండలి నిర్ణయం తీసుకుంది. ప్రతి ఇంటా భూగర్భజలాలను రీస్టోర్ చేసుకునే దిశగా ఇప్పటికే నల్లా కనెక్షన్ ఉన్న వారితో పాటు కొత్త కనెక్షన్ తీసుకోవాలనుకునే వారి ఇంటి ప్రాంగణాల్లో ఇంకుడుగుంత ఉండేలా చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగానే వచ్చే నెల 2వ తేదీ మహాత్మగాంధీ జయంతి రోజున ' ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత' పేరుతో స్పెషల్ డ్రైవ్ ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ మేరకు ఇంకుడు గుంత నిర్మించుకోవడానికి అర్హత కలిగిన జియాలజిస్టులతో అవసరమైన సాంకేతిక సహకారాన్ని జలమండలి అందించనున్నది. కేవలం వినియోగదారుల ప్రాంగణాల్లో గల బోర్లలో భూగర్భ జలాలు పెంచేందుకు ఇంకుడు గుంతలను తప్పనిసరి చేస్తూ..జలమండలి నిర్ణయం తీసుకుంది. ఇంకుడు గుంతల సర్వే నివేదికల ప్రకారం ప్రత్యేక యాప్‌లో పొందుపర్చిన డేటా ఆధారంగా డివిజన్ స్థాయి అధికారులు తమ పరిధిలోని వినియోగదారులకు అడ్వయిజరీ లేఖలు జారీ చేసే విధంగా ఆదేశాలు ఇవ్వనున్నది. ఇండ్లలోఇంకుడు గుంతలు నిర్మించడం, ఒకవేళ పాడైతే వాటికి రిపేర్ చేయడం, వాటిని మెయింటెన్ చేయాలని లేఖల్లో సూచనలు ఇవ్వనున్నది. ఒకవేళ వినియోగదారులు పైన పేర్కొన్న సూచనలను పాటించడంలో విఫలమైతే.. వచ్చే ఏడాది నుంచి ట్యాంకర్ల బుకింగ్ సందర్భంగా రెట్టింపు చార్జీల భారం పడే అవకాశాలు ఉన్నాయి.

జలమండలి ఝులక్

### నిబంధనల ప్రకారం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మించే ఆ ఇంటికి ఇంకుడు గుంత తప్పనిసరి. నల్లా కనెక్షన్‌కు సంబంధించిన పర్మిషన్ లెటర్‌లో సైతం ఇంకుడు గుంత ఏర్పాటు షరతు ఉండనున్నది. నిర్మాణ సమయంలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకున్నా..కాలక్రమేణా దాన్ని పునరుద్ధరించుకోవడంలో ఆసక్తి చూపకపోవడం, మరికొందరు అసలు ఇంకుడు గుంతలు నిర్మాణమే చేపట్టకుండానే ఇండ్లు నిర్మించుకున్నట్లు జలమండలి గుర్తించింది. దీంతో ఇప్పటికే క్యాన్ నంబర్ల ఆధారంగా ఇంకుడు గుంతల స్థితిగతులపై సర్వే చేపట్టింది. ఈ ఏడాది 14 జూన్ నుంచి సర్వే నిర్వహించగా, మొదటి విడతలో సుమారు 42,784 గృహ సముదాయాల ప్రాంగణాలు తనిఖీ చేయాలని నిర్ణయించింది. అందులో భాగంగా సెప్టెంబర్ 18 నాటికి 25,578 ప్రాంగణాలు పరిశీలించగా, వాటిలో 12,446 ప్రాంగణాలు ఇంకుడు గుంతలు కలిగి ఉండగా, మిగిలిన 13,132 వాటిల్లో లేవని గుర్తించి స్పెషల్ డ్రైవ్ ముమ్మరం చేసేందుకు జలమండలి సిద్ధమైంది. ఇక డివిజన్‌ను ఒక యూనిట్‌గా పరిగణించి తనిఖీలు ముమ్మరం చేయనున్నది. 300 చదరపు మీటర్లు, అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న బహుళ గృహ సముదాయాలతోపాటు వ్యక్తిగత గృహాల డేటా సేకరించి.. ప్రత్యేక యాప్‌లో పొందుపర్చనున్నది.







# దంచికొట్టిన వాన

**లోతట్టు ప్రాంతాలు.. జలమయం**

మోకాల్లోతు నీరు..

భారీగా ట్రాఫిక్ జామ్

చేతులెత్తేసిన పోలీసులు



సిటీబ్యూరో: బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తనం ప్రభావంతో రెండ్రోజులుగా గ్రేటర్‌లో వాన దంచికొడుతున్నది. ఈ క్రమంలో శనివారం రాత్రి గంటన్నరపాటు ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి మహానగరం అతలాకుతలమైంది. లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. రహదారులపై మోకాళ్లోతు వాననీరు చేరడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎస్ఆర్‌నగర్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఖైరతాబాద్, లక్డీకాపూల్, నాంపల్లి, మలక్‌పేట, ఎల్బీనగర్, మెహిదీపట్నం, రేతిబౌలి, అత్తాపూర్, ఉప్పర్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్ నిలిచిపోయింది. వాహనాలను క్రమబద్ధీకరించడంలో ట్రాఫిక్ పోలీసులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వాహనదారులు మరింత ఇబ్బందులుపడ్డారు. కాగా, శనివారం రాత్రి 9 గంటల వరకు లంగర్‌హౌస్‌లో అత్యధికంగా 9.10 సెం.మీల వర్షపాతం నమోదైంది. రాగల 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశమున్నదని, దీని ప్రభావంతో రాగల మూడు రోజులు మోస్తరు నుంచి భారీ, మరికొన్ని చోట్ల భారీ నుంచి అతి భారీ వానలు కురిసే అవకాశాలున్నట్లు తెలిపింది. గ్రేటర్‌కు ఎల్లో అలర్ట్ హెచ్చరికలు జారీ చేసింది.

**నగరంలో వర్షపాతం నమోదు ఇలా..**

- లంగర్‌హౌస్ - 9.10 (సెం.మీ) • ఖైరతాబాద్ -8.60 • విజయనగర్ కాలనీ-8.0 • కార్వాన్-7.38 • ఆసిఫ్‌నగర్ -7.25
- మెహిదీపట్నం-6.78 • ఫస్ట్‌లాన్సర్ -6.70 • అత్తాపూర్-6.65 • హిమాయత్‌నగర్-6.58 • పాటిగడ్డ-6.13 • బహదూర్‌పురా-5.98
- బంజారాహిల్స్, చర్లపల్లి -5.95 • జియాగూడ, షేక్‌పేట- 5.60 • రాజేంద్రనగర్-5.55 • నాంపల్లి, ఏఎస్‌రావునగర్-5.48
- గోల్కొండ, ఫిల్మ్‌నగర్-4.50 • గౌలిగూడ, జుమ్మెరాత్‌బజార్-4.40 • బన్సీలాల్‌పేట, ఉప్పల్-4.33 • అమీర్‌పేట మైత్రీవనం-3.63

### రహదారులు పరిశుభ్రంగా ఉండాలి

సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ) : గణేశ్ నిమజ్జనం జరిగిన ప్రాంతాల్లో రోడ్లు పరిశుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. శనివారం ఉదయం జోనల్, అడిషనల్ కమిషనర్లు, ఇతర విభాగాల ఉన్నతాధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. లక్ష్యం మేరకు ఇంటి పన్నును వసూలు చేయాలన్నారు. ఇంటింటి సర్వే ప్రక్రియను పూర్తి చేసి.. తప్పులు లేకుండా ఓటరు జాబితా తయారీకి చర్యలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు.



# డబుల్ ఇండ్లు ఎప్పుడిస్తరు?

## మంత్రి పొన్నం ప్రభాకర్‌ను నిలదీసిన మహిళలు

### సమాధానం ఇవ్వకుండానే వెళ్లిపోవడంపై మండిపాటు

సిటీబ్యూరో/సైదాబాద్/వనస్థలిపురం: చంచల్‌గూడ పిల్లిగుడిసెల డబుల్ బెడ్రూం ఇండ్లను శనివారం పరిశీలించేందుకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను స్థానిక మహిళలు నిలదీశారు. డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడకుండా వెళ్లడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా తమకు ఇండ్లు కేటాయించాలని చెప్పేందుకు వస్తే మంత్రి మాట్లాడకుండా వెళ్లిపోయారని, తాము కిరాయి ఇండ్లల్లో ఉండలేక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తమకు స్థానికంగా ఖాళీగా ఉన్న డబుల్ ఇండ్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. తాము కూడా లబ్ధిదారులమని, ఇంతవరకు ఇండ్లను కేటాయించలేదని, కనీసం తమ బాధలు కూడా మంత్రి వినలేదని ఆరోపించారు.

### డబుల్ ఇండ్ల పరిశీలన

మహిళలంతా ఒక్కసారిగా నిలదీయడంతో మంత్రి పొన్నం అక్కడి నుంచి చంచల్‌గూడలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీని పరిశీలించేందుకు వెళ్లిపోయారు. అంతకుముందు మంత్రి పొన్నం చంచల్ గూడ వద్ద 284 డబుల్ బెడ్రూం ఇండ్ల సముదాయంలో ఖాళీగా ఉన్న గృహాలను మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బిన్ అబ్దుల్లా బలలా, పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌లతో కలిసి పరిశీలించారు. మూసీ నది అభివృద్ధి పనులతో గృహాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ఖాళీగా ఉన్న డబుల్ గృహాలను మూసీ బాధితులకు పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. మంత్రి వెంట రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎల్బీనగర్ జడ్పీ హేమంత్ కేశవ్ పాటిల్ తదితరులు ఉన్నారు.




### సీసీఎంబీలో వినూత్న శిక్షణ

సిటీబ్యూరో, సెప్టెంబర్ 21 (నమస్తే తెలంగాణ): సెంటర్ ఫర్ సెల్యూలార్ అండ్ మాలిక్యూలార్ బయాలజీలో వినూత్న శిక్షణకు శ్రీకారం చుట్టారు. టీచర్లు, రీసెర్చ్ విద్యార్థులకు జెనిటిక్, మైక్రోబియల్ మానిటరింగ్ ట్రైనింగ్ ప్రోగ్రాం పేరిట ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. జంతు శాస్త్ర రంగంలో విద్యార్థులు, వెటర్నరీ, పరిశోధన విద్యార్థులకు అవగాహన పెంచుకునేలా శిక్షణను నిర్వహిస్తున్నారు.



**గౌలిదొడ్డిలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గురుకులాల్లో సబ్జెక్ట్ అసోసియేట్లను కొనసాగించాలని, విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్‌ను అందించాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. మాసబ్‌ట్యాంక్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ ప్రధాన కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేశారు. సీవోఈల్లో విద్యార్థులకు అందిస్తున్న నీట్, జేఈఈ శిక్షణలో సబ్జెక్ట్ అసోసియేట్లే కీలక పాత్రను పోషిస్తున్నారన్నారు.**

**- హైదరాబాద్**


# మీ శాఖ యూజ్‌లెస్!

## కరెంట్ కట్‌పై ఎక్స్ వేదికగా మండిపడ్డ వినియోగదారుడు

### గంటల తరబడి విద్యుత్‌కు అంతరాయం

ఫిర్యాదులొస్తున్నా.. పట్టించుకోకపోవడంతో ట్వీట్

అర్ధరాత్రి పునరుద్ధరణ పనులు పర్యవేక్షించిన సీఎండీ



సిటీబ్యూరో: 'సైబర్ సిటీ సర్కిల్ పరిధిలోని కొండాపూర్ శ్రీరాంనగర్ కాలనీలో 4 గంటలుగా కరెంటు లేదు. వర్షం ఆగి ఇప్పటికే 2 గంటలైంది. విద్యుత్ తీగలు దెబ్బతినడానికి భారీ గాలులు కూడా లేవు. అయినా.. సరఫరా గంటల తరబడి ఎందుకు నిలిచిపోయింది' ఇదీ సుమన్ మిత్ర అనే విద్యుత్ వినియోగదారుడు ఎక్స్ (ట్విట్టర్) వేదికగా సీఎం రేవంత్‌రెడ్డికి, టీజీఎస్‌పీడీసీఎల్ సంస్థకు చేసిన ట్వీట్. 'ట్విట్టర్ వేదికగా 2 గంటల నుంచి పవర్ కట్‌కు సంబంధించి వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తున్నాయి. అయినా మీరు చాలా కూల్‌గా సమాధానం ఇస్తున్నారంటే.. మీ శాఖ యూజ్‌లెస్ అనుకోవాలి'.. అంటూ ఘాటుగా మరో ట్వీట్‌ను రాత్రి 1.28 గంటల సమయంలో పెట్టాడు. ఇలాంటి ఫిర్యాదులు ఒక్కరి నుంచే కాదు.. గ్రేటర్ వ్యాప్తంగా ఉన్న పలు ప్రాంతాల నుంచి వందలాది మంది కరెంటు లేక గంటల తరబడి ఇబ్బందులు పడ్డామంటూ.. ట్విట్టర్‌లో పేర్కొన్నారు. గురువారం కురిసిన భారీ వర్షానికి గ్రేటర్‌లో విద్యుత్ సరఫరా చాలా చోట్ల గంటల తరబడి నిలిచిపోయింది. రాత్రి 10 నుంచి 12 గంటల వరకు వర్షం కురిసింది. ఆ తర్వాత రాత్రి 2-3 గంటల దాకా సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో నగరవాసులు అసహనం వ్యక్తం చేశారు.

### కొమ్మలు తీగలపై పడ్డాయి: సీఎండీ ముషారఫ్ ఫరూఖీ

శుక్రవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి అక్కడక్కడ కొన్ని చోట్ల చెట్లు, వాటి కొమ్మలు విరిగి విద్యుత్ తీగలు, స్తంభాలపై పడటంతో కొద్దిసేపు కరెంటు సరఫరాలో అంతరాయం కలిగింది. క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉన్న సిబ్బంది యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టి సరఫరాను సాధారణ స్థితికి తెచ్చారు. నేను స్వయంగా అర్ధరాత్రి క్షేత్ర స్థాయిలో పర్యటించి పునరుద్ధరణ చర్యలు పర్యవేక్షించా. బంజారాహిల్స్, బైరామల్‌గూడ, బండ్లగూడ, కిస్మత్‌పూర్, తార్నాక, లంగర్‌హౌజ్ ప్రాంతాల్లో చెట్లు కూలి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. గాలికి ఇతర వస్తువులు లైన్ల మీద పడటం.. ఇన్సులేటర్స్ ఫెయిల్ అవ్వడం వంటి కారణాలతో 19 ఫీడర్లు బ్రేక్ డౌన్ అయ్యాయి.



**అర్ధరాత్రి వర్షాలకు నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే పనులను పర్యవేక్షిస్తున్న టీజీఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూఖీ**

### 9910 మెగావాట్లు

డిస్కం పరిధిలో రికార్డు స్థాయిలో శుక్రవారం ఉదయం 10 గంటల 35 నిమిషాలకు 9910 మెగావాట్ల విద్యుత్ డిమాండు నమోదైందని సీఎండీ ముషారఫ్ ఫరూఖీ తెలిపారు. కాగా, భారీగా వర్షాలు పడటం, నీటి లభ్యత పెరగడం, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందుబాటులో ఉండటంతో వ్యవసాయ రంగంలో డిమాండు భారీగా పెరుగుతున్నదని, 10వేల మెగావాట్లను కూడా దాటే అవకాశమున్నదని అధికారులు వెల్లడించారు.



కోకాపేట్ సర్వే నంబర్ 147లో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యాలు

# హైడ్రా పంజా!

కోకాపేటలో సర్కారు భూమిలో అక్రమ నిర్మాణాల నేలమట్టం

మణికొండ: కోకాపేట గ్రామ సర్వే నంబర్ 147లో దాదాపు 800 గజాల సర్కారు స్థలాన్ని కొందరు ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను శనివారం హైడ్రా అధికారులు కూల్చివేశారు. దశాబ్దకాలం తాము ఇక్కడ నిర్మాణాలను చేపట్టి.. నివాసముంటున్నామని, ఇప్పుడు హైడ్రా అధికారులు తమ ఇండ్లపై బుల్డోజర్లు పెట్టి కూల్చివేశారంటూ.. స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం సమాచారం ఇవ్వకుండా పేదల నివాసాలను హైడ్రా, రెవెన్యూ అధికారులు కూల్చివేయడం సమంజసం కాదని పలువురు నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కోకాపేట గ్రామ సర్వే నంబర్ 147లో దాదాపు 800 గజాల స్థలాల్లో వేర్వేరుగా కొందరు వ్యక్తులు రాత్రికి రాత్రి నిర్మాణాలను చేపట్టి.. నివాసాలను ఏర్పర్చుకున్నారని వీటిపై స్థానికుల ఫిర్యాదుల మేరకు స్పందించి కూల్చివేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.